క్లుప్తంగా

20న సివిల్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 21వ తేదీన నేషనల్ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈ నెల 20న సివిల్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్నట్లు ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ ప్రకటనలో తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ఉండి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న రెండు తెలుగు రాష్ట్రాల్లోని యువత ఈ ఆన్‌లైన్ పరీక్షకు హాజరుకావచ్చన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఈ నెల 23వ తేదీన భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామన్నారు. పరీక్ష సిలబస్, రిజిస్ట్రేషన్ వివరాలకు 86862 33879 మొబైల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): అనారోగ్యంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాపురానికి చెందిన వృద్ధురాలు స్వయంవరపు పెద్దింట్లమ్మకు శుక్రవారం వలంటీర్ అశోక్ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. అశోక్‌ను, పెద్దింట్లమ్మ కుటుంబ సభ్యులు, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అభినందించారు.

సీతారాముల నగరోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం డౌన్ సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల నగరోత్సవం కనులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సీతారాములను ఉంచి మేళతాళాలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. దారిపొడవునా భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కంచర్ల రాము పర్యవేక్షించారు, మధురానగర్ నేతాజీ కాలనీలో శుక్రవారం సీతారాముల కళ్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు, కార్యక్రమాలను నిర్వాహకులు శ్రీను పర్యవేక్షించారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి ముంగిటకే వైద్య సేవలు

వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వినూత్నంగా గడప వద్దకే వైద్యసేవలు అందించటం ద్వారా ప్రజల ఆయుఃప్రమాణం పెరుగుతుందని వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంబటి వెంకట రాధాకృష్ణ యాదవ్ తెలిపారు. స్థానిక ముత్యాలంపాడులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్ విద్య వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో దీర్ఘకాలిక వ్యాధులతో పాటు నిరుపేదలకు సైతం నాణ్యమైన వైద్యసేవలు అందుతాయన్నారు. అలాగే అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఇప్పటికే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజల మనస్సులలో స్థానం సంపాదించుకోగా ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ ద్వారా తండ్రిని మించిన తనయుడిగా పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక కుంకుమ పూజలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా కృష్ణలంక, పాత పోలీస్ స్టేషన్ రోడ్డులోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు విశేషంగా పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ అనురాధ పర్యవేక్షించారు. శనివారం ఉదయం స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం 6.30 గంటలకు పవళింపు సేవ జరుగుతుందన్నారు. భక్తులందరూ పాల్గొనాలని ఆలయ అర్చకులు కోరారు.

పండుగలా 'మా నమ్మకం నువ్వే జగన్'

- 175 స్థానాల్లో విజయఢంకా మోగిస్తాం : ఎమ్మెల్యే విష్ణు
- లబ్ధిదారుల అనుమతితో ఇళ్లకు, ఫోన్లకు స్టిక్కర్లు అంటించిన ప్రజాప్రతినిధులు



పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'రావాలి జగన్‌- కావాలి జగన్' అనే నినాదంతో 2019 ఎన్నికల్లో 151 సీట్లను గెలుచుకున్నామని, రానున్న 2024 ఎన్నికల్లో 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలతో 175కు 175 సీట్లు సాధించి తీరుతామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ధీమా వ్యక్తం చేశారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు 63వ డివిజన్ కొత్త రాజీవ్‌నగర్, 58వ డివిజన్ సింగ్‌నగర్‌లో శుక్రవారం పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాభిప్రాయాలను సేకరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి వారికి కరపత్రాలను పంపిణీ చేశారు.

20 వరకూ కార్యక్రమాలు

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు చాలా స్పష్టంగా ఉన్నారని, ఏ గడపకు వెళ్లినా, ఏ తలుపు తట్టినా జగనన్నే మా నమ్మకం అంటూ ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకూ ఈ నెల 20వ తేదీ వరకూ ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని, ఈరోజు ఒకే సమయంలో నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ఏక కాలంలో వీటిని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం నిరుపేద ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపిందని, ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన ప్రతి కుటుంబం జగనన్నకు అండగా నిలుస్తారని స్పష్టం చేశారు.



కొత్త రాజీవ్‌నగర్‌లో స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

■ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఇసరపు దేవీ, ఎండీ షాహీనా సుల్తానా, ఉమ్మడి రమాదేవి, అలంపూరు విజయలక్ష్మి, కుక్కల అనిత, సునీత, పెనుమత్స శిరీష, బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి, కొండాయగుంట మల్లీశ్వరి, డివిజన్ ఇన్‌చార్జిలు కనపర్తి కొండలరావు, అంగిరేకుల నాగేశ్వరరావు, గుండే సుందర్‌పాల్ ఆయా డివిజన్ల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. లబ్ధిదారుల అనుమతి మేరకూ వారి ఇళ్లకు, ఫోన్లకు స్టిక్కర్లను అంటించారు.

ప్రజాభిప్రాయ సేకరణకే 'జగనన్నే మా భవిష్యత్'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ 45 నెలల పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ కోరేందుకే 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం భవానీపురంలోని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల మంది పార్టీ సైనికులు 1.65 కోట్ల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ పాలనకు వ్యత్యాసం, జగనన్న పాలనలో మంచి జరుగుతుందా లేదా? ప్రజలనే నేరుగా అడిగి తెలుసుకుంటారన్నారు. ఇంటి యజమాని అంగీకారంతో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటికి, సెల్ ఫోన్‌కు స్టిక్కర్ అంటిస్తామన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీ సిఫార్సు ఉన్నవారికి, టీడీపీ వారికి మాత్రమే పథకాలు అందేవన్నారు. జగనన్న పాలనలో పార్టీకి ఓటు వేయని వారికి కూడా పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆ దిశగా అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి

బాబుకు రామోజీనే దేవుడు

చంద్రబాబుకు రామోజీనే దేవుడని, ఆయన వద్దకు వెళ్లిన సమయంలో బూట్లు, సాక్సులు సైతం తీసివేస్తాడన్నారు. అదే చంద్రబాబు దేవుడు వద్దకు వెళ్లి బూట్లతో పూజలు చేస్తారన్నారు. దేవుళ్లను అవమానించే వ్యక్తులు చంద్రబాబు, అచ్చెంనాయుడు అని అన్నారు. చంద్రబాబు హయాంలో కూల్చిన ఆలయాలను వైఎస్ జగన్ పునర్నిర్మాణం చేస్తున్నారని గుర్తు చేశారు. కాలు నొప్పితో ఒంటిమిట్ట వెళ్లకపోతే దానిని కూడా రాజకీయాలకు వాడుకుని విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. సీఎం వైఎస్ జగన్ నగర సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండి పుణ్యశీల, తోలేటి శ్రీకాంత్, మనోజ్ కొఠారి, గౌస్ మొహిద్దీన్, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, జీఎంసీ బాషా, కార్పొరేటర్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు,

రేపటి నుంచి వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజస్థాన్ జోద్‌పూర్‌లోని ఆక్యుప్రెజర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విజయవాడ బృందావన కాలనీలోని అనంత్ డైమండ్స్ షోరూమ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు షోరూమ్ అధినేతలు భానుప్రకాష్, విష్ణుప్రియలు తెలిపారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరంలో ఆక్యుప్రెషర్ థెరపిస్ట్‌లు డాక్టర్ ధనరాజ్ చౌదరి, డాక్టర్ రేవంత్ చౌదరిలు తమ వైద్య బృందంతో పాల్గొని సేవలు అందిస్తారన్నారు. వివరాలకు 91141 12233 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు వస్త్రాల అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక శ్రీవెంకట సాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు 'స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను బహూకరించారు. పసుపులేటి రవికాంత్ మాతృమూర్తి రాజకుమారి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన శుక్రవారం వస్త్రాలు పంపిణీతో పాటు భోజనం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 10 మాసాల్లో దాతల ఆర్థిక సహకారంతో తెలుగు రాష్ట్రాల్లో 23 సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. దాతలు దేవి సుకన్య, షేక్ చాంద్ బాషా, శ్రీనివాసరావు, సీహెచ్ ప్రభాకరరావు, సూర్యకుమారి, స్వర్ణలత, వృద్ధాశ్రమ నిర్వాహకులు నాగరాజి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు, ఫాదర్లు క్రైస్తవులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు ఆరాధనలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసకులు చర్చిలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. ప్రజలందరికీ మంచి జరగాలంటూ ఆకాంక్షను వ్యక్తంచేశారు. మధురానగర్, అంబేడ్కర్ కాలనీ, పసుపుతోట, బసవతారకనగర్ తదితర ప్రాంతాల్లో చర్చిలు విశ్వాసకులతో కిటకిటలాడాయి



సింగ్‌నగర్‌లో సిలువ మోస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

భక్తితో కొలిస్తే భారాలు దూరం

సర్వజనావళి సుఖాలకోసం ఏసు రక్తం చిందించారని జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ డైరెక్టర్ రెవ.డాక్టర్ బందెల దయానందం పేర్కొన్నారు. స్థానిక మధురానగర్ కొబ్బరితోటలో జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యాన గుడ్ ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకంలో చెడును తొలగించి మానవాళికి మంచిని చేకూర్చటానికే ఏసు తన రక్తాన్ని చిందించారన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీ సీయోను పరిశుద్ధ ప్రార్థనా మందిరంలో గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రెవ.డా కనమాల వరప్రసాద్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే అనగా క్రీస్తు మానవాళి కోసం సిలువ వేయబడిన రోజు అన్నారు. ఎవరైతే ఏసుక్రీస్తును భక్తితో కొలుస్తారో వారి భారాలన్నీ ఏసు మోస్తారన్నారు. స్థానిక బసవతారకనగర్‌లో ఐపీసీ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రార్థనలు చేశారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సర్వ లోక రక్షణ కోసమే ఏసుక్రీస్తు ప్రభువు ప్రాణత్యాగాన్ని చేశారని, ఆయన బోధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే విష్ణు ప్రత్యేక ప్రార్థనలు, క్రీస్తు సిలువ త్యాగానికి ప్రతీకగా నిర్వహించిన సిలువ మార్గాల్లో పాల్గొని సిలువ మోశారు.

డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి తదితరులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. దీక్షాపరులు, ఆర్సీఎం సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొని సింగ్‌నగర్ నుంచి పైపులరోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఆంధ్రప్రభకాలనీ మీదుగా సిలువ మార్గాన్ని నిర్వహించారు.



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మేరీమాత పుణ్యక్షేత్రంలో..

గుణదల(విజయవాడతూర్పు): సర్వ మానవ పాప పరిహారార్థమే ఏసుక్రీస్తు సిలువ యాగం జరిగిందని దివ్యవాణి చానల్ కో ఆర్డినేటర్ ఫాదర్ బుర్రి జాన్ పీటర్ అన్నారు. సుప్రసిద్ధ గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానాలయం వద్ద నుంచీ కొండ శిఖరాగ్రం వరకు సిలువ మార్గం నిర్వహించారు. ఏసుక్రీస్తును సిలువ వేసిన సందర్భాన్ని మననం చేసుకుంటూ వందలాది మంది క్రైస్తవులు కాలి నడకన గుణదల కొండకు పోటెత్తారు. సిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్ పీటర్ దైవ సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ, మానవ రక్షణార్థమై ఏసుక్రీస్తు మానవ రూపిగా ఈ లోకానికి అరుదెంచారని తెలిపారు. మానవుల పాప క్షమాపణ నిమిత్తమై ఏసుక్రీస్తు సిలువ మరణం పొందారని బోధించారు. ఆయన చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ బాలసౌరి, ఫాదర్ కొలగాని మరియన్న, ఫాదర్ జి.నరేష్, సహాయ గురువులు ఫాదర్ వినోద్, ఫాదర్ యశ్వంత్ పాల్గొన్నారు.



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో సిలువ ప్రదర్శన చేస్తున్న భక్తులు



ఏసుక్రీస్తు సందేశాన్నిస్తున్న ఫాదర్లు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. మధురానగర్‌లోని సిద్ధిఖ్ మస్జీద్‌లో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఇఫ్తార్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిరుపేదలకు సహాయం చేయడం అంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని, పేదవారికి తమవంతు సాయం చేయాలని సూచించారు. ముందుగా మస్జీద్ కమిటీ పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఇఫ్తార్ విందులో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

దుర్గగుడి ఈఓ భ్రమరాంబకు సత్కారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈఓ భ్రమరాంబను చైర్మన్ కర్నాటి రాంబాబు శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. దుర్గగుడి ఈఓగా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈఓను సత్కరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఈఓ చాంబర్‌లో ఆమెను సత్కరించారు. అనుభవం కలిగిన అధికారిగా ఈఓ భ్రమరాంబ దేవస్థానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. రానున్న రోజుల్లో దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ఈఓతో కలిసి పని చేస్తామని చెప్పారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యుడు బుద్దా రాంబాబు ఉన్నారు.



ఈఓ భ్రమరాంబను సత్కరిస్తున్న చైర్మన్ రాంబాబు, సభ్యుడు బుద్దా రాంబాబు

నేడు హనుమంతరాయ గ్రంథాలయం పునఃప్రారంభం

విజయవాడకల్చరల్: నగర కళాకారులు, కళాసంస్థల ప్రతినిధుల కోసం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం, దాని అనుబంధ సంస్థ కళావేదికను ఆధునీకరించి శనివారం నుంచి అందుబాటులో తీసుకువస్తున్నట్లు హనుమంతరాయ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డోకిపర్తి శంకరరావు తెలిపారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ.. 1934వ సంవత్సరంలో గ్రంథాలయాన్ని స్థాపించారన్నారు. ఇక్కడ అనేక మంది ప్రముఖులు రంగస్థలంపై నాటకాలను ప్రదర్శించారని చెప్పారు. నేటి పరిస్థితులకు అనుగుణంగా అనేక ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేశామని రెండునెలల విరామం అనంతరం పునఃప్రారంభిస్తున్నామన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం ఏపీ ఫిలిం, టెలివిజన్, థియేటర్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, మాజీ పార్లమెంట్ సభ్యుడు మాగంటి మురళీమోహన్ వేదికను ప్రారంభిస్తారన్నారు. ఉపాధ్యక్షుడు సీఏ గద్దం సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ కార్యదర్శి రావి శారద ప్రారంభిస్తారని చెప్పారు. గ్రంథాలయంలో పరిశోధకులకు అందుబాటులోకి అనేక గ్రంథాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి నీలం దుర్గారావు, కోశాధికారి మహబూబ్ ఆజాం, బెల్లపు బాబ్జీ, నందివాడ నాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దోగిపర్తి శంకరరావు, డాక్టర్ రాంప్రసాద్, దుర్గారావు తదితరులు

ప్రజల పక్షాన బీబీఏ నిలబడుతుంది

విజయవాడ కల్చరల్: బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ప్రజల పక్షాన నిలబడుతుందని న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్, తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులకు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ బెజవాడ బార్ అసోసియేషన్ దేశంలోనే తన ప్రత్యేకతలను నిలబెట్టుకుంటోందన్నారు. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ద్వారా 8 ఏళ్లుగా బార్ అసోసియేషన్ సభ్యులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. 2023–2024 సంవత్సరానికి బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ సుందర్, ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జున్ను శ్రీధర్, సహ కార్యదర్శి నరహరిశెట్టి జ్యోతి, క్రీడా కార్యదర్శి ఆకుల పాండురంగ, గ్రంథాలయ కార్యదర్శి ఆకుల పాండురంగ విఠల్, మహిళా కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి బత్తుల వెంకటేశ్వరరావులను సత్కరించారు. తెలుగు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

కనులపండువగా ఆది దంపతుల నదీ విహారం



కృష్ణ నది వద్ద పంచ హారతులిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గంగా పార్వతి(దుర్గా) సమేత మల్లేశ్వర స్వామి వార్ల నదీ విహారం శుక్రవారం నయనానందకరంగా సాగింది. చైత్ర మాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది ఆది దంపతులకు నదీ విహారం ఏర్పాటు చేశారు. తొలుత మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద స్వామి వార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ఆది దంపతులకు పూజలు నిర్వహించి నదీ విహారానికి పయనమయ్యారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు దుర్గాఘాట్‌కు చేరుకుంది. పూలతో అలంకరించిన బోటుపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆది దంపతులను ఉంచి పూజలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణులతో పాటు చైర్మన్, ఈఓ తదితర ముఖ్య అధికారులు బోటుపైకి చేరుకున్నారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాస శాస్త్రి, యజ్ఞనారాయణ శర్మ, ఇతర అర్చకులు పూజలు నిర్వహించారు. మూడు సార్లు నదిలో ప్రదక్షిణగా తిరిగి దుర్గాఘాట్‌కు చేరుకుంది. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, చింకా శ్రీనివాసరావు, నంబూరి రవి, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, నిడమానూరి కళ్యాణి, అల్లూరి కృష్ణవేణి, తొత్తడి వేదకుమారి, దుర్గగుడి అధికారులు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



నదీ విహారంలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు విష్ణు, వెలంపల్లి తదితరులు